

ఘనంగా మార్కండేయ జయంతి

కాల్వశ్రీరాంపూర్: మండలకేంద్రంలోని భక్త మార్కండేయ ఆలయంలో మార్కండేయుని జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ ఆడెపు శ్రీదేవి పాల్గొన్నారు.



జీపీలకు పక్కా భవనాలు

గ్రామ పంచాయతీలకు శాశ్వత భవనాల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది.

8లో▸

గరిష్టం/కనిష్టం
31.0 /17.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంది. సాయంత్రం చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

మాతాశిశు ఆరోగ్య కేంద్రం తనిఖీ



కేసీఆర్ కిట్ అందిస్తున్న జెడ్పీ చైర్మన్ పుట్ట మధు దంపతులు

మంథని: మంథనిలోని మాతాశిశు ఆరోగ్య కేంద్రాన్ని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు, మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ మంగళవారం సందర్శించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గర్భిణులు, బాలింతలను పలకరించారు. వైద్యసేవలపై ఆరాతీశారు. స్త్రీ వైద్య నిపుణురాలు స్రవంతి, హెడ్ నర్స్ సంపూర్ణ రాణితో మాట్లాడి సౌకర్యాలు, సమస్యలు తెలుసుకున్నారు. వరండాలో ఫ్యాన్లు ఏర్పాటు చేస్తామని, తాగునీటి సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. నార్మల్ డెలివరీలు అయ్యేలా చూడాలన్నారు. అనంతరం కేసీఆర్ కిట్లను అందించారు. ముందుగా స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో సైన్స్ ల్యాబ్ ప్రారంభించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ కొండ శంకర్, సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, రైతుబంధు అధ్యక్షుడు ఆకుల కిరణ్, పార్టీ మండల అధ్యక్షుడు ఏగోళపు శంకర్‌గౌడ్, నాయకులు ఎక్కేటి అనంతరెడ్డి, ఇర్ఫాన్, ఆసీఫ్ ఉన్నారు.

నాణ్యమైన మందులనే విక్రయించాలి



మాట్లాడుతున్న ఆదిరెడ్డి

మంథని: రైతులకు నాణ్యమైన రసాయన ఎరువులు, మందులు విక్రయించాలని జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి సూచించారు. స్థానిక ఎంపీడీఓ సమావేశ మందిరంలో డివిజన్‌లోని మంథని, ముత్తారం, కమాన్‌పూర్, రామగిరి మండలాల డీలర్లతో మంగళవారం సమావేశమయ్యారు. వ్యవసాయ శాఖ నిబంధనలకు లోబడి ఎరువులు, విత్తనాలు విక్రయించాలని సూచించారు. లైసెన్సులకు సంబంధించిన విధివిధానాలను డీలర్లకు వివరించారు. మంథని వ్యవసాయ సంచాలకులు మురళి, వ్యవసాయ అధికారులు శ్రీకాంత్, ప్రమోద్, మోహన్ తదితరులు ఉన్నారు.

దళితులను మోసగిస్తున్న సీఎం



కాలనీవాసులతో మాట్లాడుతున్న విజయ్

పెద్దపల్లిరూరల్: రాష్ట్రం వస్తే దళితుడినే తొలి ముఖ్యమంత్రిని చేస్తానన్న సీఎం కేసీఆర్ ఆ మాట మరచిపోయారని మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు విమర్శించారు. గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా 25, 26 వార్డుల్లో పర్యటించారు. డ్రైనేజీలు, రోడ్లను పరిశీలించారు. అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రం ఏర్పాటును స్థానిక ఎమ్మెల్యే మరచిపోయారని, ఎస్సీ హాస్టల్ ఊసులేదని, దళిత శ్మశాన వాటికలో కనీస వసతులు లేవని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌కు మద్దతుగా నిలవాలని కోరారు. నాయకులు ఈర్ల స్వరూప, బొంకూరి అవినాష్, నర్సయ్య, మల్లయ్య, సురేష్‌గౌడ్, శ్రీమాన్, వెంకటేశ్, రవి తదితరులున్నారు.

పిల్లలు బడికి.. పెద్దలు పనికి..



ధ్రువ పాఠశాలను ప్రారంభిస్తున్న డీసీపీ

పెద్దపల్లిరూరల్: వలస కూలీలు తమ పిల్లలను బడికి పంపించాలని, పెద్దలు పనికి వెళ్లాలని డీసీపీ రూపేష్ సూచించారు. పెద్దపల్లి మండలం గౌరెడ్డిపేట, రాఘవాపూర్ గ్రామాల్లోని మూడు ఇటుక బట్టీల్లో ధ్రువ పాఠశాలలను ప్రారంభించారు. పిల్లలకు వారి మాతృభాష లోనే బోధన సాగించేలా బట్టి యజమానులు ఏర్పాట్లు చేశారు. చిన్నారులకు పలకలు, నోట్ పుస్తకాలు అందించారు. ఏసీపీ సారంగపాణి, సీఐ ప్రదీప్‌కుమార్, ఎస్సైలు రాజేశ్, శ్రీనివాస్ ఉన్నారు.

ఆటాడేస్తున్నారు..!

పాపం శ్రీనివాస్..



- ఆకుల శ్రీనివాస్, సోదరుడు తిరుపతి కలిసి 6 సంవత్సరాల క్రితం వేములవాడ మండలం వెంకటాంపల్లిలోని 26, 36, 39, 41, 42, 43, 44 సర్వేనంబర్లలో గల సాగు భూమిని రిజిస్ట్రేషన్ దస్తావేజు ద్వారా కొనుగోలు చేశారు. ధరణి రాక ముందు జరగగా మ్యుటేషన్ చేయడంలో ఆలస్యం అయింది. అంతలోనే ధరణి వచ్చి చేరింది. దీంతో ధరణిలో మ్యుటేషన్ చేయాల్సిన రెవెన్యూ అధికారులు శ్రీనివాస్‌ను బంతాట ఆడుతున్నారు. ఒక్కోసారి ఒక్కో కొర్రీ పెడుతూ కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారు. ముందు కాలువ కింద భూమి పోకున్నా.. పోయిందని ప్రొహిబిటెడ్ జాబితాలో చేర్చారు. తరువాత రుణమాఫీ అయినప్పటికీ బ్యాంక్ లోన్ ఉందని నెలల తరబడి తిప్పుకున్నారు. సాక్షి కథనం క్రమంలో రెండు, మూడు సర్వే నంబర్లను పరిష్కరించగా మళ్లీ అదే పరిస్థితి. 36, 39, 41 ఇతర సర్వేనంబర్లలోని బై నంబర్లలో కొన్నింటికి డిజిటల్ సైన్ చేయగా మరికొన్ని నాలా అంటూ, ప్రొహిబిటేడ్ అంటూ పేర్కొనడం విడ్డూరం. తీరా కలెక్టర్ చేతిలో ఉందని చేతులెత్తేశారు. ఫలితంగా ఆరేళ్లుగా రైతుబంధు అందకపోగా ఇతర ప్రయోజనాలు పొందడం లేదు.

ఎవరి తప్పు..



- ఈ రైతు పేరు కస్తూరి కీర్తికుమార్. కరీంనగర్ రూరల్ మండలంలోని నగునూరు గ్రామం. గ్రామంలోని 924/ఆ/2/1లో వారసత్వంగా 12 గుంటలు నమోదు కావాల్సి ఉండగా కేవలం 2 గుంటలు మాత్రమే నమోదైంది. ఇదెక్కడి అన్యాయమని రెవెన్యూ అధికారులను కలిస్తే ఉపశమన మాటలే తప్ప పరిష్కరించలేదు. మీసేవలో చేసిన దరఖాస్తులో తప్పుల వల్లే తప్పుగా నమోదైందని అధికారులు చెబుతుండటం విశేషం. ఇవి కేవలం వీరిద్దరి సమస్యనుకుంటే పొరపాటే. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వేల మంది రైతుల గోస.



- తప్పు చేసేదివారే.. నిర్లక్ష్యం వారిదే..
- భూ రికార్డుల నిర్వహణలో ఇష్టారాజ్యం
- వేలమంది రైతుబంధుకు దూరం
- అప్పులిచ్చేందుకు బ్యాంకుల నిరాకరణ

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: 'ఎవరో జ్వాలను రగిలించారు.. వేరెవరో దానికి బలి అయ్యారు' అన్న పదాలకు ధరణి పోర్టల్ సమస్యలు సరిగ్గా సరిపోతాయి. భూముల విషయంలో పారదర్శకత తీసుకువస్తామని చెప్పి.. అమలులోకి తీసుకువచ్చిన ధరణి పోర్టల్‌లో పాత సమస్యలు పరిష్కరించకపోగా కొత్త సమస్యలు సృష్టిస్తూ రైతులను ముప్పతిప్పలు పెడుతోంది. చిన్న పొరపాట్లు, అక్షరదోషాలు, తప్పుల సవరణ చేసేందుకు సైతం అధికారులు బాధితులను నెలల తరబడి కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారు. ఈ క్రమంలో సామాన్యులు.. అందులోనూ రైతులు నానా ఇబ్బందుల పడుతున్నారు. ఫలితంగా ప్రభుత్వపరంగా అందాల్సిన రైతుబంధు వీరికి అందని ద్రాక్షగా మారింది. సవరణలు చేయాలని కాళ్లరిగేలా తిరిగినా.. కనికరించే నాథుడు లేకుండా పోవడం అత్యంత బాధాకరం.

- ప్రభుత్వం భూ సమస్యల్లేకుండా దిద్దుబాటు చర్యలు చేపడుతుండగా అధికార యంత్రాంగ నిర్లక్ష్యం గుదిబండలా మారింది. కాలువ కింద భూమి పోకున్నా పోయిందని, నాలా భూమని, బ్యాంకు లోన్ ఉందంటూ తిర'కాసులు' పెడుతూ కార్యాలయాల చుట్టూ తిప్పుకోవడం వీరికే చెల్లు. నెలలు కాదు ఏళ్లుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారంటే విధుల పట్ల ఎంత చిత్తశుద్ధి ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. సర్వే నంబర్ సమస్యలో ఉంటే సరే అందులోని బై నంబర్లు సరిగా ఉండటం, మరిన్ని సమస్యల్లో ఉంచడం దేనికి సంకేతం. పలువురు కలెక్టర్లు రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంపై కొరడా ఝుళిపిస్తుండగా పలువురు కలెక్టర్లు పట్టనట్లు వ్యవహరించడం విడ్డూరం. ప్రతీ కుటుంబంపై కలెక్టర్‌కు అవగాహన ఉండాలని, సమస్యల్లేకుండా పాలన ఉండాలనే జిల్లాల విభజన చేసినట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించగా క్షేత్రస్థాయిలో పరిస్థితి విరుద్ధం.

సమస్యలు ఎన్నెన్నో..!

ఎకరాన రూ.20 లక్షలు పలికినా భూముల ధరలు నేడు కోటికి చేరడంతో అత్యంత విలువైందిగా మారింది. దీంతో భూ వివాదాలు తారాస్థాయికి చేరుతున్నాయి. ఎప్పటికప్పుడు సమస్యల్లేకుండా చొరవ తీసుకోవాల్సిన యంత్రాంగం నత్త నడకన వ్యవహరించడం దారుణ పరిణామం. ఒకరి భూమి ఒకరి పేరున నమోదవడంతో వీటిని తిరిగి పొందేందుకు ఆప్షన్లు సైతం లేకుండా పోయాయి. నాలుగైదు దశాబ్దాల కిందట భూములు అమ్ముకున్నవారు సైతం ధరణిలో రెవెన్యూ అధికారుల తప్పిదాల కారణంగా వారి పేర్లు రావడంతో భూములు అమ్ముకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఏళ్లతరబడి సాగుచేసుకుంటుండగా వంశపారంపర్యంగా వచ్చిన భూములు ఇతరుల పేర్లపై ధరణిలో నమోదయ్యాయి. పక్కాగా ఉన్న పట్టా భూములు సైతం నిషేధిత జాబితాలో చేరాయి. దీంతో రైతులు పంట రుణాలు పొందలేని దుస్థితి ఏర్పడింది. చాలా సర్వే నంబర్లు మిస్ అయ్యాయి. ఏళ్లుగా రైతుబంధుకు దూరమవుతున్నారు.

ధరణి పేరిట కాలయాపన.. ప్రజావాణిలో అత్యధికం ఇవే

రెవెన్యూ అధికారులు మామూలుగా పరిష్కరించే సమస్యలను కూడా ధరణితో ముడిపెడుతున్నారు. రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాలో ఈ తరహా కేసులు ఉండటం ఆశ్చర్యపరుస్తోంది. జగిత్యాల జిల్లాలో 8,174 దరఖాస్తులు రాగా ఇందులో తిరస్కరించినవి 2,685. అంగీకరించినవి 5,489. అంటే 426 రోజుల్లో రోజుకు 12 అర్జీలు వచ్చినట్లు అధికారికంగా ఇచ్చిన సమాచారంతో స్పష్టమవుతోంది. ఈ లెక్కన రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో మరో 15 వేల వరకు ధరణి దరఖాస్తులుంటాయని స్పష్టమవుతోంది. ఇక ప్రజావాణిలో వచ్చే దరఖాస్తుల్లో అత్యధికం ఇవే ఉండటం అధికారుల పనితీరుకు నిదర్శనం. ప్రతీ సోమవారం కలెక్టరేట్లలో ప్రజావాణి జరుగుతుండగా సుమారు 200 వరకు అర్జీలొస్తున్నాయి. ఇందులో 70–90వరకు ఇవే అర్జీలున్నాయంటే పరిస్థితి తీవ్రతను చాటుతోంది.

మార్పులకు అవకాశంలోనూ నిర్లక్ష్యం..!

రాష్ట్ర ప్రభుత్వం ధరణిలో పలు ఆప్షన్లకు అవకాశమిచ్చింది. అయినా.. అధికారుల వల్లమాలిన నిర్లక్ష్యం రైతులకు శాపమవుతోంది. పట్టాదారు పాసు పుస్తకంలో అక్షర దోషాలు ఉన్నా పొరబాటున వేరే పేరు పడినా సరి చేసుకోవచ్చు. మహిళకు బదులు పురుషుడు, పురుషుడికి బదులు మహిళ అని అచ్చు తప్పు దొర్లినా, రిజర్వేషన్ కేటగిరీ తప్పుగా నమోదైనా, ఆధార్ నంబర్ తప్పుగా నమోదైనా సరిచేసుకోవచ్చు.

- అలాగే పట్టా, సీలింగ్, భూదాన్, అసైన్డ్ వంటివి తప్పుగా నమోదైతే మార్పు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.
- భూమి ఏ విధంగా సంక్రమించిందనే వివరాల్లో తప్పులుంటే మార్చుకునే వీలుంది.
- వాస్తవ భూమి కంటే పాస్ పుస్తకంలో తక్కువగా నమోదైతే మార్చుకునే వీలుంది. దీంతో ఎక్కువ.. తక్కువ సమస్యలు తొలగుతాయి.
- భూమి వర్గీకరణ మాగాణి, తరి, మెట్ట వంటి వివరాల మార్పిడి చేసుకోవచ్చు.
- వారసత్వం, అన్న, తమ్ముడు, సొంతం, కుమారుడు వంటివి మార్చుకునే అవకాశముండగా ఏదైనా సర్వే నంబర్ లేదా సబ్ డివిజన్ నంబర్ కనిపించకపోవడం, ఆ మేరకు విస్తీర్ణం తక్కువగా నమోదైతే మార్చుకునే అవకాశముంది. దీనికి సంబంధించిన సర్వే నంబర్లను ఎంచుకోవచ్చు.
- ఏదైనా కారణంతో భూమి 1బీ ఖాతాలో చేరి ఆ తర్వాత పరిష్కారమైతే వాటిని పట్టా నమోదుకు అవకాశం ఇచ్చారు. కానీ సదరు అర్జీల్లోనూ నిర్లక్ష్యం చేస్తున్నారని ఉమ్మడి జిల్లా రైతులు వాపోతున్నారు.

దేశానికి దిక్సూచీలా తెలంగాణ

- రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్
- ఖనిలో ప్రధాన కూడళ్ల ప్రారంభం
- దివ్యాంగులకు ట్రైసైకిళ్ల పంపిణీ



గోదావరిఖనిలో ట్రైసైకిళ్లు అందిస్తున్న మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే

గోదావరిఖని: రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ తెలిపారు. కార్పొరేషన్ ఆధ్వర్యంలో రూ.1.16 కోట్లతో ఆధునీకరించిన ప్రధానచౌరస్తా, రాజేశ్ థియేటర్ చౌరస్తా కూడళ్లను మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వికలాంగులకు ట్రైకిళ్లు, మహిళలకు కుట్టుమిషన్లు, క్రమబద్ధీకరణ పట్టాలు అందించారు. స్థానిక బీఆర్ఎస్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రతికుటుంబానికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఎంపీ బోర్లకుంట వెంకటేశ్ మాట్లాడుతూ అమరుల త్యాగాలను గుర్తుంచుకునేలా ప్రధాన చౌరస్తాలో స్తూపం నిర్మించడం శుభపరిణామం అన్నారు. ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమానికి కవులు, కళాకారులు ఊపిరిపోశారన్నారు. మేయర్ బంగి అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ అభిషేక్‌రావు, అదనపు కలెక్టర్ కుమార్‌దీపక్, కమిషనర్ సుమన్‌రావు, కార్పొరేటర్లు అడ్డాల స్వరూప, దుబాసి లలిత, గాదం విజయ, కల్వల శిరీష, మంచికట్ల దయాకర్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు కాంగ్రెస్ అధికార ప్రతినిధి బెంద్రం రాజిరెడ్డి, దాసరి ఆనంద్, మేరుగు చంద్రమౌళి తదితరులు మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.

వృద్ధులకు అండగా ప్రభుత్వం

సుల్తానాబాద్: వృద్ధులకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం ముందుచూపుతో వయోవృద్ధుల జిల్లా కార్యాలయాన్ని ఏర్పాటు చేసిందని మంత్రి ఈశ్వర్ తెలిపారు. మండలకేంద్రంలో ప్రభుత్వం మంజూరు చేసిన వయోవృద్ధుల భవనానికి మంగళవారం రాత్రి శంకుస్థాపన చేశారు. వృద్ధులను కొందరు ఇంట్లో నుంచి గెంటేస్తున్నారని, అలాంటివారి కోసం ప్రతి మూడు నెలలకోసారి కలెక్టర్ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. వృద్ధులకు ఆహ్లాదకరమైన వాతావరణంతోపాటు వాకింగ్ ట్రాక్, వైద్యం, మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని ఎంపీ తెలిపారు. ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాకేంద్రానికి దీటుగా సుల్తానాబాద్‌ను అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు. కలెక్టర్ సంగీత, డీడబ్ల్యూవో రవుఫ్, గ్రంథాలయ చైర్మన్ రఘువీర్ సింగ్, మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత, ఎంపీపీ బాలాజీరావు, రైతు సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ అనంతరెడ్డి, ఏఎంసీ చైర్మన్ బుర్ర మౌనిక, అధికారులు పాల్గొన్నారు.

ఆలయాల్లో పవన్ పూజలు

- కొండగట్టు అంజన్న సన్నిధిలో పవన్ కల్యాణ్
- వారాహి ప్రచార రథానికి ప్రత్యేక పూజలు
- కార్యకర్తలతో సమావేశమైన జన సేన అధినేత
- ధర్మపురి నృసింహుని సన్నిధిలో 'అనుష్టుప్' యాత్ర మరూ



కొండగట్టు శ్రీఆంజనేయస్వామి సన్నిధిలో మాట్లాడుతున్న జనసేన అధినేత పవన్ కల్యాణ్

మల్యాల/కొడిమ్యాల(చొప్పదండి)/ధర్మపురి: జన సేన అధినేత, సినీ నటుడు పవన్ కల్యాణ్ కొండగట్టు శ్రీఆంజనేయస్వామి, ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామిని మంగళవారం దర్శించుకున్నారు. ఆయనను చూసేందుకు ఉమ్మడి జిల్లాకు చెందిన వేలాది మంది యువత, అభిమానులు తరలివచ్చారు. తొలుత కొండగట్టు అంజన్న ఆలయ అర్చకులు ఆయనకు స్వాగతం పలికారు. తర్వాత పవన్ కల్యాణ్ శ్రీఆంజనేయస్వామికి శేష వస్త్రాలు, తమలపాకులు, పండ్లు సమర్పించారు. మూలవిరాట్టుకు అభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు జితేంద్ర స్వామి, ఉపప్రధాన అర్చకులు చిరంజీవి, అభిల్‌కృష్ణ, రామ్, లక్ష్మణ్.. పవన్ కల్యాణ్‌కు స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. అనంతరం జనసేన ప్రచార రథం వారాహి వాహనానికి పూజలు నిర్వహించారు. పవన్ కల్యాణ్ రాక సందర్భంగా అంజన్న సన్నిధిలో దర్శనం నిలిపివేయడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. వారాహి పూజ అనంతరం ఆ వాహనంపైకి ఎక్కిన పవన్ కల్యాణ్ అభిమానులకు అభివాదం చేశారు. తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి జన సేన పనిచేస్తుందని అన్నారు. ఆ తర్వాత 'జై తెలంగాణ' అంటూ ప్రచా రం ముగించారు. మరోవైపు.. నాచుపల్లిలోని బృందావన్ రిసార్ట్స్ వద్ద కార్యకర్తలతో సమావేశమైన పవన్ కల్యాణ్‌ను చూసేందుకు వందలాది మంది అభిమానులు తరలివెళ్లారు. లోనికి చొచ్చుకెళ్లేందుకు యత్నించగా, వారిని వారించేందుకు పోలీసులు లాఠీచార్జీ చేశారు. తమ పార్టీ నాయకులను లోనికి ఎందుకు అనుమతించడంలేదని జన సేన పార్టీ నాయకుడు దయాకర్.. రిజర్వ్ సీఐని దుర్భాషలాడారు. దీంతో కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

ధర్మపురి నృసింహుని సన్నిధిలో..

సాయంత్రం 6.30గంటలకు ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహుని సన్నిధికి చేరుకున్న పవన్ కల్యాణ్.. వేద పండితులు బొజ్జ రమేశ్‌శర్మ మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు జరిపారు. దేవస్థానం ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్వామివారి శేషవస్త్రం కప్పి తీర్థ ప్రసాదాలు అందజేశారు. పవన్ రాక సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా డీఎస్పీ ప్రకాశ్ ఆధ్వర్యంలో ధర్మపురి పట్టణాన్ని అష్టదిగ్బంధం చేశారు. భారీసంఖ్యలో తరలివచ్చిన అభిమానులను అదుపు చేయడానికి పోలీసుల చర్యలు సాధ్యం కాలేదు. మీడియా ప్రతినిధులను కాదని కేవలం దేవస్థానం సిబ్బంది, మున్సిపల్ కౌన్సిలర్లను లోనికి అనుమతించడం వివాదాస్పదమైంది.

'పది' ఫలితాల్లో మెరుస్తాం..!

పెద్దపల్లిరూరల్: జిల్లాలో త్వరలో జరిగే పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధిస్తామని, ఈ మేరకు విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని డీఈవో మాధవి స్పష్టం చేశారు. ఉపాధ్యాయులకు పదోన్నతి కల్పించడంతోపాటు బదిలీ చేపట్టాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు టీచర్ల వివరాలు, సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేపట్టామన్నారు. మన ఊరు.. మనబడి కార్యక్రమంలో భాగంగా తొలివిడతగా 191 పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టామని, ఈ నెల చివరికి మండలానికో రెండు మోడల్ పాఠశాలల్లో పూర్తి చేస్తామని వివరించారు. మరుగుదొడ్లు, మూత్రశాలల సౌకర్యం కల్పించామని, తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. పాఠశాలల్లో విద్యాబోధన, ఉపాధ్యాయుల హాజరు, మధ్యాహ్న భోజనం అమలు తీరు తదితర అంశాలపై 'సాక్షి'తో మాట్లాడారు.

- బదిలీ, పదోన్నతుల వివరాలసేకరణలో నిమగ్నం
- మన ఊరు.. మనబడితో పాఠశాలల్లో సౌకర్యాలు
- స్కూళ్లలో నీటివసతి, మరుగుదొడ్ల వసతి

'సాక్షి' ఇంటర్వ్యూలో డీఈవో మాధవి



సాక్షి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన ఎలా ఉంది..?

డీఈఓ: ఉపాధ్యాయులు సమయపాలన పాటించేలా చర్యలు తీసుకున్నాం. విద్యార్థులకు సులువుగా అర్థమయ్యేలా బోధిస్తున్నారు. ఇంగ్లిష్, తెలుగు మీడియంలో బోధన సాగుతోంది.

సాక్షి: పది పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం..?

డీఈఓ: పదో తరగతి పరీక్షల్లో జిల్లా ఉత్తీర్ణత శాతం బాగుంది. ఈ సారి కూడా మంచి ఫలితాలు సాధిస్తాం. ఇందుకోసం విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. కలెక్టర్ సూచన మేరకు అల్పాహారం, స్టడీమెటీరియల్ అందిస్తున్నాం.

సాక్షి: పదోన్నతులు, బదిలీల ప్రక్రియపై..?

డీఈఓ: జిల్లాలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు సంబంధించిన సర్టిఫికెట్ల వెరిఫికెషన్ జరుగుతోంది. బదిలీ, పదోన్నతుల్లో ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా సిద్ధంగా ఉన్నాం. రెండు, మూడురోజుల్లో బదిలీ ప్రక్రియ మొదలుకావొచ్చు.

సాక్షి: మన ఊరు..మనబడి పనులు ఎలా సాగుతున్నాయి..?

డీఈఓ: జిల్లాలో 549 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. అందులో మన ఊరు..మన బడి కార్యక్రమం కింద తొలివిడతగా 191 పాఠశాలలను ఎంపిక చేశాం. ఆయా పాఠశాలల్లో చేపట్టిన పనులు పురోగతిలో ఉన్నాయి. ఉపాధి హామీ పథకం అనుసంధానంగా చేపట్టిన ఆరు పాఠశాలల్లో నెమ్మదిగా సాగుతున్నాయి.

సాక్షి: విద్యార్థులకు కనీస వసతులు కల్పించారా..?

డీఈఓ: విద్యార్థులు కూర్చునేందుకు అవసరమైన ఫర్నిచర్ ఉంది. తాగునీటి వసతి కల్పించాం. మరుగుదొడ్లు, మూత్రశాలలు ఏర్పాటు చేశాం. ఎక్కడైనా చిన్నచిన్న సమస్యలు ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే మరమ్మతు చేయిస్తున్నాం.

సాక్షి: పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందాయా..?

డీఈఓ: అన్ని తరగతుల విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాంను అందించాం. పాఠ్యపుస్తకాల ఆధారంగానే విద్యాబోధన సాగుతోంది.

సాక్షి: టీచర్, పేరెంట్స్ సమావేశాలు మొక్కుబడిగా సాగుతున్నాయనే ఆరోపణలపై..?

డీఈఓ: ఉపాధ్యాయులు, పేరెంట్స్ సమావేశాలు నిర్వహించుకోవడం వల్ల విద్యార్థుల తీరుపై ఓ అవగాహన ఏర్పడుతుంది. వీలైనంత వరకు సమావేశాలను ఏర్పాటు చేస్తున్నారు. అక్కడక్కడ ఏమైనా సమస్యలుంటే గుర్తించి పరిష్కరిస్తాం.

క్లుప్తంగా

పద్మశాలీలు ఆర్థికంగా ఎదగాలి



జయంతి కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

ముత్తారం: పద్మశాలీలు ఆర్థికంగా ఎదగాలని పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు వేముల రామ్మూర్తి అన్నారు. మండలకేంద్రంలోని అడవి శ్రీరాంపూర్ చౌరస్తాలో భక్త మార్కండేయ జయంతి నిర్వహించారు. మార్కండేయ చిత్రపటానికి పూలమాల వేశారు. పద్మశాలీలు ఐక్యంగా ఉండాలని, ఇందుకు మరిన్ని కమిటీలు వేస్తామని అన్నారు. వైస్ ఎంపీపీ సుధాటి రవీందర్‌రావు, కార్యవర్గ సభ్యులు గూట్ల రమేశ్, మండల అధ్యక్షుడు గూట్ల రవి, మాజీ సర్పంచ్ తాటిపాముల వకుళారాణి, నాయకులు తాటిపాముల శంకర్, సదానందం, కుమారస్వామి, సుగుణ పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట నాన్‌టీచింగ్ వర్కర్ల నిరసన



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న నాన్‌టీచింగ్ వర్కర్స్

పెద్దపల్లిరూరల్: కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో పనిచేస్తున్న నాన్‌టీచింగ్ వర్కర్స్ సమస్యలను పరిష్కరించాలంటూ మంగళవారం కలెక్టరేట్ ఎదుట నిరసనకు దిగారు. కేజీబీవీ, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో నాయకులు నరేశ్, సుశీల, శిరీష మాట్లాడారు. కనీస వేతనాల సలహా మండలి సిఫార్సులను అమలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. తక్షణమే వేతనాలను రూ.26వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. నాయకులు శ్యామల, వెంకటలక్ష్మి, పద్మ, స్రవంతి, మమత, స్వరూప, మల్లీశ్వరి, రజిత, కవిత తదితరులున్నారు.

వలస కార్మికుడు మృతి



ముకుల్ మహతో మృతదేహం

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టులోని ప్రైవేట్ కంపెనీలో కాంట్రాక్టు కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్న వలస కార్మికుడు ముకుల్ మహతో(45) నివాస క్యాంపులో మృతిచెందాడు. స్థానికుల వివరాలు.. ఢిల్లీకి చెందిన ముకుల్ మహతో బ్యాగింగ్ ఇండియా లిమిటెడ్‌లో పని చేస్తున్నాడు. అతడు నివాసం ఉంటున్న క్యాంపులోని గదిలో సోమవారం రాత్రి స్పృహ లేకుండా ఉన్న సమయంలో క్యాంపు సేఫ్టీ ఆఫీసర్ ఆంటోని ప్రాజెక్టు మేనేజర్ రామస్వామికి సమాచారం అందించారు. ముకుల్‌ను చికిత్స నిమిత్తం గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా మృతిచెందాడని వైద్యులు తెలిపారు. మంగళవారం ఉదయం మృతుడి కుటుంబసభ్యులకు సమాచారం అందించగా వారు మాట్లాడారు. ముకుల్‌కు అప్పుడప్పుడు ఛాతిలో నొప్పి వస్తుందని, దానితోనే మృతిచెంది ఉంటాడని, అతడి మృతిపై అనుమానాలు లేవని తెలిపారు. ఢిల్లీ నుంచి ఇక్కడికి వచ్చే స్తోమత లేదని పేర్కొన్నారు. ఎన్టీపీసీ పోలీసులకు ఫిర్యాదు చేసి మృతదేహాన్ని ఢిల్లీకి పంపించాలని కోరినట్లు రామస్వామి తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జీవన్ పేర్కొన్నారు.

జీపీలకు పక్కా భవనాలు

- జిల్లాకు 88 మంజూరు
- ఒక్కోదానికి రూ.20 లక్షలు

సుల్తానాబాద్(పెద్దపల్లి): గ్రామ పంచాయతీలకు శాశ్వత భవనాల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఉపాధి పథకం నిధులతో పంచాయతీరాజ్ శాఖ పర్యవేక్షణలో ఒక్కొక్కటికి రూ.20లక్షలతో నిర్మించనున్నారు. జిల్లాకు 88 భవనాలు మంజూరయ్యాయి. పెద్దపల్లి నియోజకవర్గంలో 42, రామగుండం 7, మంథని 24, ధర్మపురి 15 కాగా జిల్లాలో 226 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. శిథిలావస్థకు చేరిన పంచాయతీలతోపాటు పలు చోట్ల శాశ్వత భవనాలు లేక అద్దె గృహాల్లో కొనసాగుతున్నాయి. పంచాయతీలకు ఉన్నతాధికారులు వస్తే మూత్ర విసర్జనకు సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నూతనంగా నిర్మిస్తున్న వాటిలో అలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు అధికారులు చర్యలు చేపట్టనున్నారు. జిల్లాకు మంజూరైన వాటికి త్వరలో టెండర్లు పిలవనున్నట్లు జిల్లా అధికారి తెలిపారు.

స్థలం కేటాయింపు

రాష్ట్ర ప్రభుత్వం శివారు గ్రామాలు, తండాలను పంచాయతీలు చేసింది. కొత్తగా ఏర్పడిన పంచాయతీలను అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. అలాగే పాత పంచాయతీల్లో ఏనాడో నిర్మించిన కొన్ని భవనాలు శిథిలావస్థకు చేరాయి. వీటిలోనూ కొత్తవి నిర్మించాలని ప్రతిపాదన ఉంది. కొత్తగా ఏర్పడిన పంచాయతీల భవనాలకు 1,000 చ.గ. స్థలాలను రెవెన్యూ అధికారులు కేటాయిస్తున్నారు.

నూతన బిల్డింగులు ఇలా..

పంచాయతీ కార్యదర్శి, గ్రామ సర్పంచులకు వేర్వేరు గదులు ఉండనున్నాయి. ప్రత్యేక సమావేశాలకు పాలకవర్గానికి మరొక గది ఆధునిక హంగులతో నిర్మాణం చేపట్టనున్నారు. ఉపాధి పథకం ద్వారా అంచనా వేసి పంచాయతీరాజ్ శాఖకు సిఫార్సు చేశారు.



కాట్నపల్లి పంచాయతీ కార్యాలయం

నియోజకవర్గాల వారీగా మంజూరైన కొత్త పంచాయతీలు

పెద్దపల్లి నియోజకవర్గంలో..		రామగుండం నియోజకవర్గంలో..	
మండలం	కొత్త పంచాయతీలు	అంతర్గాం	4
పెద్దపల్లి	4	పాలకుర్తి	3
ఎలిగేడు	7	మంథని నియోజకవర్గంలో..	
జూలపల్లి	3	మంథని	15
ఓదెల	8	ముత్తారం	4
శ్రీరాంపూర్	8	కమాన్‌పూర్	2
సుల్తానాబాద్	12	రామగిరి	3
ధర్మపురి నియోజకవర్గంలో..		ధర్మారం	15

భవనం మంజూరైంది



సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి గ్రామానికి నూతన పంచాయతీ భవనం మంజూరైంది. దీనికి పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి సహకారం ఉంది. త్వరలో పంచాయతీ భవనం పనులు చేపడుతాం.
– ఎం.మోహన్‌రెడ్డి, సర్పంచ్, కాట్నాపల్లి

పోలీసుల అదుపులో గంజాయి విక్రేతలు

- ఇద్దరు అరెస్ట్.. పరారీలో మరొకరు
- వివరాలు వెల్లడించిన డీసీపీ రూపేశ్



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ రూపేశ్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణంలోని చీకురాయి క్రాస్ రోడ్ ప్రాంతంలో గంజాయి అమ్ముతున్న ఇద్దరు యువకులను మంగళవారం అదుపులోకి తీసుకున్నట్లు డీసీపీ రూపేశ్ తెలిపారు. పెద్దపల్లి ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పెద్దపల్లి పట్టణంలోని సుభాష్‌నగర్‌కు చెందిన షేక్ నాగుర్ పాషా, సయ్యద్‌నబీ కాలనీకి చెందిన ఎండీ.మహబూబ్ చీకురాయి రోడ్‌లో గంజాయి అమ్ముతున్నారనే పక్కా సమాచారంతో వెళ్లి వారిద్దరినీ అదుపులోకి తీసుకున్నామన్నారు. గంజాయికి బానిసలైన ఇరువురు యువకులు సుభాష్‌నగర్‌కే చెందిన అయిలాపురం రఘుపతి నుంచి 800 గ్రాముల గంజాయిని కొని డబ్బు సంపాదించాలనే ఆలోచనతో చిన్న పాకెట్లుగా మార్చి అమ్మేందుకు నిర్ణయించుకున్నారని విచారణలో చెప్పారని పేర్కొన్నారు. వీరిరువురికి గంజాయి ఇచ్చిన రఘుపతి పరారీలో ఉన్నాడని తెలిపారు. గంజాయి నిందితులను పట్టుకున్న పోలీసు అధికారులు, సిబ్బందిని అభినందించారు. సమావేశంలో ఏసీపీ సారంగపాణి, సీఐ ప్రదీప్‌కుమార్, ఎస్సై రాజేశ్ ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న సీనియర్ జడ్జి అర్జున్

- యువత చట్టాలపై అవగాహన పెంచుకోవాలి
- మహిళలు వేధింపులకు గురైతే 1098కు కాల్‌చేయాలి
- సీనియర్ సివిల్ జడ్జి అర్జున్

పెద్దపల్లిరూరల్: యువత చట్టాలపై కనీస అవగాహన పెంచుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి అర్జున్ అన్నారు. జిల్లాకేంద్రంలోని ఓ ప్రైవేటు కాలేజీలో మంగళవారం ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో పలు సూచనలు చేశారు. ప్రస్తుతం సైబర్ నేరాలు పెరుగుతున్నాయన్నారు. సోషల్ మీడియాలో అపరిచితులతో చాటింగ్ చేస్తూ వ్యక్తిగత సమాచారాన్ని షేర్ చేయొద్దని యువతకు సూచించారు. విద్యార్థినులు, మహిళలు వేధింపులకు గురైతే 1098 టోల్‌ఫ్రీ నంబరుకు సమాచారం అందించాలన్నారు. గృహహింస, వరకట్న నిషేధ చట్టం, వినియోగదారుల హక్కుల చట్టం తదితర అంశాలపై బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేశ్‌బాబు, న్యాయవాదులు హన్మాన్‌సింగ్, మూర్తి తదితర న్యాయవాదులు అవగాహన కల్పించారు.

కాలుష్య నివారణకు కోర్టులో కేసు

గోదావరిఖని: రామగుండం డివిజన్–1 పరిధి జీడీకే–5 ఓసీపీ బ్లాస్టింగ్ కాలుష్యం నివారించాలని కోరుతూ 11డివిజన్ కార్పొరేటర్ పెద్దెల్లి తేజస్విని మంగళవారం జిల్లా కోర్టులో కేసు దాఖలు చేశారు. బ్లాస్టింగ్‌లతో పర్యావరణ కాలుష్యం, దుమ్ము, ధూళి, పొగ, విషవాయువులు వెలువడడి శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నామని, ఇళ్ల బీటలు వారుతున్నాయని గోదావరిఖని అదనపు జిల్లా కోర్టు, మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్‌కు ఫిర్యాదు చేసినట్లు వివరించారు. కోర్టులో1/2023గా కేసు నమోదు చేసి, ప్రతివాదులు సింగరేణి యాజమాన్యం, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఇంజనీర్, పీసీపటేల్ కంపెనీ, జీడీకే–5 ఓసీపీ ప్రాజెక్టు ఆఫీసర్‌లు ఫిబ్రవరి 4న పెద్దపల్లి జిల్లా కోర్టులో సరైన ఆధారాలతో హాజరు కావాలని నోటీసులు జారీ చేసినట్లు కార్పొరేటర్ వెల్లడించారు.

'మన ఊరు – మనబడి' వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్

ఓదెల: పాఠశాలల్లో 'మనఊరు మనబడి' పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ సంగీత తెలిపారు. మండలంలో గుండ్లపల్లె, బీమరిపల్లె పాఠశాలల్లో అభివృద్ధి పనులను పరిశీలించారు. వంటగదులు, మరుగుదొడ్లు, ప్రహరీ నిర్మాణాలను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సర్పంచు పులుగు తిరుపతిరెడ్డి, కల్లెపల్లి సరిత, ఎంపీపీ కునారపు రేణుకాదేవి, తహసీల్దార్ రమేశ్, ఎంపీడీవో సత్తయ్య, ఎంఈవో ఆరెపల్లి రాజన్న, ఎస్ఎంసీ చైర్మన్ వేల్పుల సదయ్య పాల్గొన్నారు. అనంతరం ఓదెల, కొలనూర్‌లో చేపడుతున్న కంటివెలుగు కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు.

ఓదెల పీఆర్ ఏఈ సస్పెన్షన్

పెద్దపల్లిరూరల్: ఓదెల మండల పంచాయతీరాజ్ ఏఈ సమ్మిరెడ్డిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ సంగీత మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మన ఊరు.. మనబడి పనుల్లో కలెక్టర్ సహా.. ఉన్నతాధికారులు పలుమార్లు సూచనలు చేసినా నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు గుర్తించిన కలెక్టర్ ఏఈపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బిల్లుల చెల్లింపు, ఎంబీ రికార్డు నమోదులో నిర్లక్ష్యంగా వ్యవహరించి పనులు సకాలంలో పూర్తి చేయని కారణంగా సమ్మిరెడ్డిపై సస్పెన్షన్ వేటు వేశారు.

సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు భూమిపూజ

గోదావరిఖని: రూ.22కోట్లతో ఆర్జీ–1 ఏరియా జీడీకే–2,2ఏ గనికి సమీపంలో నిర్మించనున్న 17ఎంఎల్‌డీ సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు ఎమ్మెల్యే కోరుకంటి చందర్, సింగరేణి డైరెక్టర్లు చంద్రశేఖర్, బలరాం భూమిపూజ నిర్వహించారు. సుందిళ్ల, ముస్త్యాల మీదుగా మంథనికి వెళ్లే నూతన రోడ్డును ప్రారంభించారు. కార్యక్రమంలో జీఎం కె.నారాయణ, టీబీజీకేఎస్ నాయకులు మిర్యాల రాజిరెడ్డి, కెంగర్ల మల్లయ్య, గండ్ర దామోదర్‌రావు పాల్గొన్నారు.



బల్దియా జంక్షన్లు జిగేల్..!



గోదావరిఖని గాంధీచౌక్ జంక్షన్, రాజేశ్ థియేటర్ జంక్షన్ జిగేల్‌మంటున్నాయి. రూ.1.16 కోట్లతో కార్పొరేషన్ ఈ జంక్షన్లను తీర్చిదిద్దింది. గాంధీచౌక్ సర్కిల్‌లో మరవీరుల స్తూపం, గాంధీ విగ్రహం, గ్రీనరీ, లైటింగ్, ఆకట్టుకునే బొమ్మలను ఏర్పాటు చేశారు. రాజేశ్ థియేటర్ జంక్షన్‌లో మహాత్మాజ్యోతిబా పూలే విగ్రహం, గ్రీనరీ, లైటింగ్, పక్షుల బొమ్మలతో అలంకరించారు. – కోల్‌సిటీ

బొగ్గుబాయి వార్తలు

అభివృద్ధి పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న డైరెక్టర్లు తదితరులు

గోదావరిఖని(రామగుండం): ఆర్జీ–2 ఏరియాలో రూ.35.50 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను సింగరేణి డైరెక్టర్లు చంద్రశేఖర్, బలరాం మంగళవారం ప్రారంభించారు. ఏరియాలో నూతనంగా రూ.22కోట్లతో నిర్మించిన బేస్ వర్క్‌షాప్, రూ.4కోట్లతో ఎస్అండ్‌డీ సెక్షన్, రూ.9.60కోట్లతో నిర్మించిన మెయిన్ మాగ్జిన్‌షెడ్లకు ప్రారంభోత్సవం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, ఉద్యోగుల మౌలిక సదుపాయాలైన క్వార్టర్ల నిర్మాణం, పార్కులు, వర్క్ షాప్స్ కల్పనకు సంస్థ ఖర్చు చేయడానికి వెనకాడదని, ఇదే స్ఫూర్తితో సంస్థ పురోభివృద్ధికి ప్రతిఒక్కరూ పాటుపడాలన్నారు. క్వారీ పని స్థలాలకు దగ్గరగా వర్క్ షాప్‌లు నిర్మించడం వల్ల సమయం కలిసివస్తుందని, దీంతో సంస్థపై వ్యయ భారం తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్జీ–2 జీఎం మనోహర్, సివిల్ జీఎం రమేష్‌బాబు, డీజీఎం సివిల్ ధనుంజయ్, యూనియన్ నాయకులు మిర్యాల రాజిరెడ్డి, ఐలి శ్రీనివాస్, అధికారులు మోహన్‌రెడ్డి, అబ్దుల్‌సలీం, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులకు అండగా ఉంటాం

- ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్



వినతి పత్రం అందజేస్తున్న జనక్‌ప్రసాద్

గోదావరిఖని(రామగుండం): సింగరేణి మహిళా ఉద్యోగులకు ఐఎన్‌టీయూసీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం ఆర్జీ–1 ఏరియా వర్క్‌షాప్ కోఆర్డినేటర్‌గా జనగామ స్వప్నను నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇటీవల కాలంలో సంస్థలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులపై వేధింపులు, దాడులు పెరిగిపోయాయన్నారు. ఈవిషయంలో యాజమాన్యం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. మహిళలకు రక్షణ కల్పించడంలో యాజమాన్యం విఫలమైందన్నారు. సింగరేణిలో కూడా మహిళల రక్షణకు ప్రత్యేక సెల్ ఏర్పాటు కోసం యాజమాన్యంపై ఒత్తిడి తీసుకువస్తామని పేర్కొన్నారు. అనంతరం వర్క్‌షాప్ డీజీఎం మదన్‌మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ధర్మపురి, దాస్, అశోక్‌చక్రవర్తి, రాజయ్య, సదానందం, అలేఖ్య, నర్మద, కళ్యాణి, శంకరయ్య పాల్గొన్నారు.

సింగరేణి బకాయిలు వెంటనే చెల్లించాలి

- బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న సత్తయ్య

గోదావరిఖని(రామగుండం): సింగరేణి సంస్థకు రావాల్సిన బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. మంగళవారం జీడీకే–2ఏ గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. రూ.25వేల కోట్ల బకాయిలు పేరుకుపోవడంతో జీతాలు చెల్లించలేని స్థితికి సింగరేణి చేరుకుందన్నారు. సంస్థలో శరవేగంగా సాగుతున్న కాంట్రాక్టీకరణ, ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు మరో ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. 11వ వేతన ఒప్పందం ఖరారులో బీఎంఎస్ కీలకపాత్ర పోషించిందన్నారు. కార్యక్రమంలో నాయకులు సారంగపాణి, మాదాసి రవీందర్, స్వామి, సాంబయ్య, రాజేశం, నారాయణ, శ్రీకాంత్, కోటయ్య, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీ–3లో ఉత్తమ కార్మికులు వీరే

రామగిరి(మంథని): ఆర్జీ–3 పరిధిలో ఉత్తమ కార్మికులను ఎంపిక చేసినట్లు అధికార ప్రతినిధి విలాస్ శ్రీనివాస్ పొద్దారు తెలిపారు. బొగే శంకరయ్య (ఈపీ ఆపరేటర్ ఓసీపీ–1), మచ్చగిరి నరేందర్ (ప్రాజెక్టు అధికారి ఓపీపీ– 2), శ్రీకాంత్ కట్కూరి (డీవై మేనేజర్ ఏఎల్‌పీ), కెక్కర్ల లీలాప్రసాద్ (ఫిట్టర్ ఓసీపీ–1), ఎం.విష్ణుమూర్తి (ఫోర్‌మెన్ ఓసీపీ–1), కొప్పుల మల్లయ్య (ఫోర్‌మెన్ ఓసీపీ–1 సీహెచ్‌పీ), షేక్ ఇమామొద్దీన్(ఈపీ ఆపరేటర్ ఓసీపీ–2), జి.వెంకటేశ్వర్లు (ఫోర్‌మెన్ ఓసీపీ–2), మేకల రమేష్(ఎస్‌డీఎల్/ఎల్‌హెచ్‌డీ ఆపరేటర్ ఏఎల్‌పీ), బానోత్ కార్తీక్ (ఫోర్‌మెన్ ఏఎల్‌పీ) ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఉత్తమ కార్మికులుగా ఎంపికైన వారిని ఈనెల 26న సన్మానించనున్నట్లు తెలిపారు.

చీఫ్ సెక్యూరిటీ అధికారి పర్యటన



జీడీకే–7ఎల్ఈపీ గని వద్ద చీఫ్ సెక్యూరిటీ అధికారి, సీనియర్ సెక్యూరిటీ అధికారులు

గోదావరిఖని(రామగుండం)/రామగిరి(మంథని): సింగరేణి సంస్థ రామగుండం డివిజన్– 1,2,3 ఏరియాల్లో చీఫ్ సెక్యూరిటీ అధికారి శశిధర్‌రాజు మంగళవారం పర్యటించారు. ఈసందర్భంగా పలు చెక్‌పోస్టులు, గనులు, ఓసీపీలను తనిఖీ చేశారు. సంస్థ ఆస్తుల పరిరక్షణకు తీసుకోవలసిన విషయాలపై చర్చించారు. ఆర్జీ–2 ఏరియాలోని సీహెచ్‌పీ వ్యాగన్ లోడింగ్ పాయింట్, వే బ్రిడ్జీలు, జీడీకే 7 ఎల్ఈపీ గని, ఏరియా స్టోర్స్, వర్క్‌షాప్ తదితర సెక్యూరిటీ పోస్టులను తనిఖీ చేశారు. అలాగే ఆర్జీ–3, ఏపీఏ ఏరియాల్లో జీఎం తన్నీరు వెంకటేశ్వర్‌రావును కలిసి వివరాలు తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, దొంగతనాలు జరగకుండా అనుక్షణం అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఆర్జీ–1,2,3 ఏరియా సీనియర్ సెక్యూరిటీ అధికారులు వీరారెడ్డి, పీవీ రమణ, లక్ష్మీనారాయణ తదితరులున్నారు.

ఓబీ కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలి



జీఎంకు వినతిపత్రం ఇస్తున్న కౌశిక్‌హరి

గోదావరిఖని(రామగుండం): సింగరేణిలో పనిచేస్తున్న ఓబీ కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు పెంచాలని బీజేపీ నేత కౌశిక్‌హరి డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్జీ–1 జీఎంను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, జీడీకే–5 ఓసీపీలో పీసీపటేల్, ఆర్‌వీఆర్, సుశీఇన్‌ఫ్రా ఓబీ కాంట్రాక్టర్లు వేతనాలు పెంచాలన్నారు. ఓబీల్లో పనిచేస్తున్న డ్రైవర్లు, హెల్పర్లకు సరైన వేతనాలు లేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు, వేతనాలు పెంచకుంటే ఓబీల్లో సమ్మె చేస్తామని హెచ్చరించారు. సమ్మెకు వెళ్లేముందు ప్రిన్సిపుల్ ఎంప్లాయిలర్‌గా ఆర్జీ–1 జీఎంను కలిసి వినతి పత్రం అందజేశామన్నారు. ఈవిషయంలో జీఎం సానుకూలంగా స్పందించి కాంట్రాక్టర్లతో మాట్లాడటానికి హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున్, మహావాది రామన్న, పున్నం శశికుమార్, బైరం రవివర్మ, నిమ్మరాజుల రవి, ఓబీ డ్రైవర్లు ఉన్నారు.

సాగులో రైతులకు ప్రోత్సాహం

పెద్దపల్లిరూరల్: జిల్లా రైతులకు యాసంగిలో అవసరమైన ప్రోత్సాహం అందించామని జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ రేణుక అన్నారు. మంగళవారం నిర్వహించిన జెడ్పీ స్థాయిసంఘాల సమావేశాల్లో మాట్లాడారు. సాగు పెట్టుబడిని తగ్గించేందుకు వెదజల్లే, డ్రమ్‌సీడర్ పద్ధతిని ప్రోత్సహించామని జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి తెలిపారు. 32 పంచాయతీలకు డ్రమ్‌సీడర్లు సమకూర్చామని, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అమలవుతున్న పథకాలను అర్హులైన వారికి అందించాలని స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ సంధ్యారాణి అన్నారు. విద్యార్థులకు ఉపకారవేతనాలు తదితర వివరాలను జిల్లా అధికారి మధుసూదనశర్మ వివరించారు. అంగన్‌వాడీల్లో పౌష్టికాహారం సక్రమంగా అందేలా చూడాలని ధర్మారం జెడ్పీటీసీ పూస్కూరి పద్మజ అన్నారు. గర్భిణులు, బాలింతలకు కేంద్రాల ద్వారా అందుతున్న ఫలాలను సూపర్‌వైజర్ సుగుణ వివరించారు. గర్భిణులకు సామూహిక సీమంతాలు చేసేందుకు నిధులు రావని, దాతలు సహకరిస్తేనే చేయిస్తున్నామని పేర్కొన్నారు. జెడ్పీటీసీలు రాములు, సుమలత పాల్గొన్నారు.